ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు, వీహెచ్‌పీఎస్ నాయకులు

పింఛన్ పెంచాలని
దివ్యాంగుల నిరసనలు

- ఆయా జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- సీఎం రేవంత్‌రెడ్డిని ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిక
- ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడికి వినతిపత్రం

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ)/నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,016 నుంచి రూ.6,016కు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దివ్యాంగులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట వృద్ధులు, దివ్యాంగులు బైఠాయించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు చేపట్టిన ధర్నాలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ.. పింఛన్ మొత్తాన్ని పెంచకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో దివ్యాంగులు నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు, వృద్ధులు బైఠాయించారు.

ప్రజాభవన్‌లో వినతిపత్రం..

హైదరాబాద్‌లో నిర్వహించిన 'చలో ప్రజాభవన్' కార్యక్రమంలో భాగంగా అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6,016కు తక్షణమే పెంచాలని కోరారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో దివ్యాంగుల సంఘాల నాయకులు పులిపాటి శ్రీనివాస్, శివరాత్రి రాజయ్య, అందే దయామని గోవింద్, శంకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బొగ్గుగనుల వేలంపై కన్నెర్ర

- సింగరేణి ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్
- సింగరేణి బెల్టులోని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- కేంద్రం దిగరాకపోతే నిరవధిక సమ్మెకు పిలుపు

పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 5 (నమస్తేతెలంగాణ): సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గుగనులను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై వామపక్షాలు, కార్మిక సంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు శుక్రవారం సింగరేణి కారిడార్‌లోని ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ల ఎదుట , హైదరాబాద్ లక్డీకాపూల్ సింగరేణి భవన్ ముందు మహాధర్నా నిర్వహించాయి. బొగ్గుగనుల ప్రైవేటీకరణను మానుకోవాలని, బొగ్గుబ్లాకుల వేలాన్ని ఆపాలని, ఆ గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశాయి. వామపక్ష కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్యకర్తలు, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, టీడీపీ ప్రతినిధులతో పాటు ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా శాఖల నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముందు జరిగిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ నాయకులు పశ్యపద్మ, ఈటీ నర్సింహ, అంజయ్య నాయక్, సీపీఎం నాయకులు డీజీ నరసింహారావు, సాగర్, ఎం శ్రీనివాస్, గుమ్మడి నరసయ్య (సీపీఐ మాస్‌లైన్), జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వరరావు (సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ), ధర్మతేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బందిపోటు దొంగల్లాంటి కార్పొరేట్ అధిపతులతో మోదీ కుమ్మక్కై దేశ సంపదను విక్రయిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ గుండె చప్పుడు, తెలంగాణ ఆస్తి, తెలంగాణ వెలుగు సింగరేణిని కూడా కార్పొరేట్ అధిపతులకు అప్పగించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. సీపీఎం నాయకులు డీజీ నరసింహారావు మాట్లాడుతూ.. సింగరేణి విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనేక అబద్ధాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకునే దాకా ఉత్తరాదిలో చేపట్టిన రైతు ఉద్యమ స్ఫూర్తితో బొగ్గుబ్లాకుల వేలాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ సంపదను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ ఎంపీ కిషన్‌రెడ్డికి బొగ్గు గనుల శాఖ మంత్రి పదవి అప్పగించి, తెలంగాణ బొగ్గును ఆయన చేతుల మీదుగానే ప్రైవేట్ వ్యక్తులకు అమ్మిస్తున్నారని దుయ్యబట్టారు. దీనిని అడ్డుకోవాల్సిన మంత్రి కిషన్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా హాజరవడం చూస్తే రెండు పార్టీలు మిలాఖత్ అయ్యాయన్న అనుమానాలు వస్తున్నాయని విమర్శించారు. వామపక్ష పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నేతలు ఎర్రజెండాలు పట్టుకొని ఆయా జిల్లా కేంద్రాల్లో భారీగా ర్యాలీలు నిర్వహించి కలెక్టరేట్లకు చేరుకున్నారు. అనంతరం కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు.

ఉపాధి కల్పించాలని
నేతన్న నిరసన

సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహంపై కూర్చుండి నిరసన తెలుపుతున్న నేత కార్మికుడు పాము ప్రభాకర్

రాజన్న సిరిసిల్ల, జూలై 5 (నమస్తే తెలంగాణ): నేత కార్మికులకు పనిలేక కుటుంబ పోషణ భారమవుతున్నదని, ప్రభుత్వం స్పందించి నేతన్నలకు ఉపాధి కల్పించాలని ఓ నేత కార్మికుడు విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహంపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపాడు. వరంగల్ జిల్లాకు చెందిన పాము ప్రభాకర్ 25 ఏండ్ల క్రితం కుటుంబంతో కలిసి సిరిసిల్లకు వలస వచ్చి నేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇవ్వకపోవడంతో మరమగ్గాలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కుటుంబాలను పోషించలేక కొందరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. పనిలేక కుటుంబ సభ్యులకు తిండికి గోసపడుతున్నామంటూ ప్రభాకర్ ఆవేదన వ్యక్తంచేశాడు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు కలుగజేసుకుని ప్రభాకర్‌కు నచ్చజెప్పి కిందికి దింపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ..

తమకు పనిలేకపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని, అడ్డమీద కూలికి పోదామన్నా.. ఆ పని కూడా దొరకడం లేదని, భార్యాపిల్లలకు కడుపునిండా అన్నం పెట్టలేని తనకు.. ఈ బతుకెందుకంటూ కంటతడిపెట్టాడు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరల ఆర్డర్ల వల్ల చేతి నిండా పనితో పదేండ్లు మంచిగ బతికినమని తెలిపాడు. నెలకు రూ.20 వేలు సంపాదించేవాడినని, కాంగ్రెస్ సర్కారు వచ్చినంక ఆర్డర్లు ఇవ్వకపోవడం, పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల సేట్లు సాంచాలు బంద్‌పెట్టారని, రెండు నెలలుగా పనిలేక రోడ్డుపైన తిరుగుతున్నానని వాపోయాడు. ఇప్పటికే తోటి కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం తమకు పనికల్పించి ఆదుకోవాలని, తమకేదైనా జరిగితే బాధ్యత సర్కారుదేనని చెప్పాడు.

మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి

- బాసర ట్రిపుల్‌ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీల వినతి

బాసర, జూలై 5 : తమ బాధలను అర్థం చేసుకొని తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీకి పలువురు గెస్ట్ ఫ్యాకల్టీలు లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము ఆరేండ్లుగా పని చేస్తున్నామని, ఏటా తమను రెన్యువల్ చేసుకునేవారని, కానీ ఈ ఏడాది యూనివర్సిటీ ప్రారంభమై నెల రోజులైనా విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు.

కామన్‌టైం టేబుల్‌తో
ప్రయోజనం శూన్యం: పీఆర్‌జీటీఏ

హైదరాబాద్, జూలై5 (నమస్తే తెలంగాణ): అన్ని గురుకులాల్లో ఒకే విధమైన పని వేళలను ప్రవేశపెడుతూ జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రొగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. కామన్ టైంటేబుల్ అమలుతో ఎలాంటి ప్రయోజనమూ చేకూరబోదని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి నేతృత్వంలో చీఫ్ సెక్రటరీ ఓఎస్డీ విద్యాసాగర్, మైనార్టీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ తస్వీర్ ఇక్బాల్‌అహ్మద్‌ను శుక్రవారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కామన్ టైంటేబుల్‌లో ఎలాంటి శాస్త్రీయత లేదని, దీంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని వెల్లడించారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. పీఆర్‌జీటీఏ ప్రతిపాదించిన టైంటేబుల్‌ను అమలు పరుచాలని, లేదంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ వేణుప్రసాద్, జాయింట్ సెక్రటరీలు ఉప్పు అశోక్, డాక్టర్ ఇడికోజు శ్రీనివాసాచారి, డాక్టర్ నిర్మలానందం, టెక్రిస్ విభాగం అధ్యక్షుడు పానుగంటి విజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ చెల్కాని సంజీవరెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడు గుర్రం రమేశ్, రంగారెడ్డి అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు ఏసురత్నం, నరేశ్ పాల్గొన్నారు.

స్టాఫ్‌రూం వరకే 'సెల్‌ఫోన్లు'

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): పాఠశాల పనివేళల్లో సెల్‌ఫోన్ల వాడకంపై విద్యాశాఖ అధికారులు ఆంక్షలు విధించారు. సెల్‌ఫోన్లను వినియోగించరాదని, వాట్సాప్‌లో పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు. ఇటీవల పాఠశాల సమయంలో అధికారులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది టీచర్లు వాట్సాప్‌లో పోస్టులు పెడుతున్నట్టుగా గుర్తించారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆయా జిల్లాల అధికారులు పలు ఆదేశాలు జారీచేశారు. టీచర్ల సెల్‌ఫోన్లను హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, స్పెషలాఫీసర్లు తమ కస్టడీ(స్టాఫ్ రూం)లో పెట్టుకోవాలని, బోధన సమయంలో అవసరాన్ని బట్టి ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంల అనుమతితోనే టీచర్లు సెల్‌ఫోన్లను వినియోగించాలని సూచించారు.

వరంగల్ జిల్లా రాయపర్తి గురుకులంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయపర్తిలో గురుకుల సిబ్బంది నిరసన

రాయపర్తి, జూలై 5: సాంఘిక సంక్షేమ గురుకులాల పనివేళలను కుదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గురుకులాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, తాజా ఉత్తర్వుల మేరకు 8 గంటలకే ప్రారంభించాల్సి వస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ ఒంటెద్దు పోకడలు, ఉద్యోగుల వ్యతిరేక నిర్ణయాలను ఇప్పటికైనా మానుకోవాలని, గురుకులాల పనివేళలను సవరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కుల గణనకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

- బీసీ కమిషన్‌కు కుమారస్వామి వినతి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : కుల గణనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, కమిషన్ సభ్యుడు ఉపేంద్రను బీసీ దళ్ నేతలతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్, ప్రొఫెసర్ బాలయ్య, సంచార కులాల సంఘం జాతీయ అధ్యక్షుడు నరహరి, ఉమేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఫ్రీ టికెట్‌పై హ్యాండ్సప్!

- ఆర్టీసీకి ప్రభుత్వ బకాయి రూ. 2500 కోట్లు
- ప్రతి నెలా నిధులు చెల్లిస్తామని హామీ
- 6 నెలలైనా కన్నెత్తి చూడని సర్కారు
- బెనిఫిట్స్‌కూ మొండిచెయ్యే
- పదవీ విరమణ అయినా పైసల్లేవ్
- సర్కారుపై ఆర్టీసీ ఉద్యోగుల ఫైర్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండో రోజే గొప్పగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీని నష్టాల్లోకి తీసుకెళ్తున్నదని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అమల్లోకి వచ్చిన తరువాత ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ 100శాతానికి పెరిగిందని.. కొన్ని బస్సుల్లో 120 శాతం కూడా ఉంటుందని సంస్థ అధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రోజుకు 50 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నట్టుగా వెల్లడించారు. ఇందులో 70శాతం మంది మహిళా ప్రయాణికులే కావటం గమనార్హం. ఈ ఉచిత బస్సు పథకం కింద మహిళలకు జీరో టికెట్ ఇస్తుండగా వాటికి డబ్బులను ప్రభుత్వం చెల్లిస్తుంది. మహిళల జీరో టికెట్‌కు సంబంధించి దాదాపు రూ.2500 కోట్ల నిధులను సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిన కొత్తలో బస్‌పాస్‌ల రాయితీ కోసం రూ.340 కోట్లు విడుదల చేసింది. ఉచిత బస్సు ప్రయాణం టికెట్ల నిధులను ప్రతీ నెల చెల్లిస్తామని పథకం ప్రారంభం రోజున సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారని కార్మిక సంఘాల ప్రతినిధులు గుర్తు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం మర్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నో క్యాష్..

ఉద్యోగకాలంలో పోగైన 300 ఆర్జిత సెలవు (ఈఎల్స్)లకు ఎన్‌క్యాష్‌మెంట్ ఉంటుంది. ఆర్టీసీలో పదవీవిరమణ వయసు 60 ఏళ్లకు పెంచిన తర్వాత, 2022 డిసెంబర్ నుంచి ఆర్జిత సెలవుల మొత్తం చెల్లించటం ఆగిపోయింది. ఈ మొత్తం కనిష్టంగా రూ.5 లక్షల వరకు ఉంటుంది. ఆర్టీసీ ఉద్యోగులకు కరువు భత్యం పేరుకుపోయింది. 2017లో జరగాల్సిన వేతన సవరణను గత మే నెల నుంచి అమలులోకి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్‌తో దాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ వాటి బకాయిలను రిటైర్మెంట్ సమయంలోనే చెల్లించనున్నట్టు అప్పట్లో ఆర్టీసీ వెల్లడించింది. ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇచ్చే గ్రాట్యుటీ చెల్లింపులకు ఫిబ్రవరి నుంచి బ్రేక్ పడింది. డ్రైవర్, కండక్టర్ లాంటి వారికి దాదాపు రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు ఈ మొత్తం అందాల్సి ఉంటుంది. ఈడీ లాంటి పెద్ద పోస్టులోని అధికారులకు రూ.60 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. దాదాపు ఐదు వందల కుటుంబాలు గ్రాట్యుటీ కోసం ఎదురు చూస్తున్నారు.

బాండ్ డబ్బులూ బకాయిలే..

ఆర్టీసీలో 2013 వేతన సవరణను 2015లో అమలు చేశారు. రెండేండ్ల బకాయిల్లో 50 శాతం మొత్తాన్ని బాండ్ల రూపంలో చెల్లించాల్సి ఉంది. సర్వీసు ఉద్యోగులకు పెండింగ్‌లో పెట్టినా, రిటైర్ అయిన వారికి వెంటనే చెల్లిస్తూ వస్తున్నారు. జనవరి నుంచి రిటైర్ అయిన వారికి కూడా చెల్లించటం నిలిపివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో అందరు ఉద్యోగులకు బాండ్ బకాయిలు చెల్లిస్తామని మూడు నెలల క్రితం సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కొన్ని నిధులే విడుదల కావటంతో కేవలం డ్రైవర్లకు చెల్లించి వదిలేశారు. జనవరి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లింపులు మాత్రం పునరుద్ధరించలేదు. ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ.లక్షన్నర వరకు అందాల్సి ఉంది. దాదాపు 1500 రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఈ నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి.

బీఆర్ఎస్ కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ

- యాదగిరిగుట్టలో కాంగ్రెస్ కబ్జాలను అడ్డుకున్నందుకు దౌర్జన్యం
- కండ్లల్లో కారం చల్లి.. పోలీసులు కొట్టారని బాధితుల ఆరోపణ
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతల రాస్తారోకో

పోలీసుల తీరును నిరసిస్తూ యాదగిరిగుట్టలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు, కార్యకర్తలు

యాదగిరిగుట్ట, జూలై 5: యాదగిరిగుట్టలోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర ఖాళీ ప్రదేశంలో కాంగ్రెస్ నేతల కబ్జాలను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. మోకాళ్లు, చేతులతో పాటు శరీరంపై ఎక్కడి పడితే అక్కడ కొట్టారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రాత్రి వరకు స్టేషన్‌లోనే ఉంచి కండ్లల్లో కారం చల్లి మరీ కొట్టినట్టు బాధితులు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఆకుల రాజశేఖర్, సాయితోపాటు మరికొందరు క్రాంతి యూత్‌ను స్థాపించి 2001 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్ డిపో ఎదురుగా కొండపైకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన 2003లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహం పక్కన ఖాళీ ప్రదేశంలో జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంతోపాటు తెలంగాణ అమరులకు నివాళి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ విగ్రహం దగ్గర ఖాళీ స్థలంలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనుచరులు, పట్టణానికి చెందిన ఇద్దరు ముఖ్య నాయకులు శాశ్వతంగా షెడ్లను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలను బీఆర్ఎస్ కార్యకర్తలు మూడు రోజుల క్రితం అడ్డుకున్నారు. విగ్రహం కనిపించకుండా నిర్మాణాలు చేపట్టొద్దని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు విగ్రహం పక్కన కొబ్బరిబొండాలను విక్రయించే మహిళ లక్ష్మితో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆకుల రాజశేఖర్, సాయిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. విషయం తెలుసుకునేందుకు స్టేషన్‌కు వెళ్లిన వారి స్నేహితుడు తాళ్ల రాజేశ్వర్‌రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదు లేకున్నా.. అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 9 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచి ముగ్గురిపై కారంపొడి చల్లి మరీ థర్డ్ డిగ్రీని ప్రయోగించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య స్టేషన్‌కు వెళ్లి థర్డ్ డిగ్రీపై సీఐ రమేశ్‌ను ప్రశ్నించగా.. థర్డ్ డిగ్రీని ప్రయోగించలేదని, గాయాలు ఎలా అయ్యాయో తెలియదని బుకాయించారు. పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో శుక్రవారం యాదగిరిగుట్ట ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేశారు. థర్డ్ డిగ్రీని అమలు చేసిన సీఐ రమేశ్, ఎస్సై జ్ఞానేశ్వర్‌రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీసీపీ రాజేశ్‌చంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి తదితరులు పాల్గొన్నారు. ఈ ఘటనపై సీఐ రమేశ్‌ను వివరణ కోరగా.. తాము ఎవరినీ కొట్టలేదని, బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉన్న గాయాలకు, పోలీసులకు సంబంధం లేదని తెలిపారు. చిరువ్యాపారి లక్ష్మి తన దుకాణంపై దౌర్జన్యం చేశారని ఫిర్యాదు చేయడంతోనే అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఒత్తిడితోనే కొట్టారు

షెడ్ల నిర్మాణాలను అడ్డుకున్నామన్న అక్కసుతోనే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనుచరులు పోలీసులతో మమ్మల్ని కొట్టించారు. మేం ఎంత బతిమిలాడినా పోలీసులు వినిపించుకోలేదు. కండ్లల్లో కారంపొడి చల్లి మరీ కొట్టారు. పోలీసులు అధికార కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారి అమాయకులను శిక్షించడం దుర్మార్గం.

-ఆకుల రాజశేఖర్, బాధితుడు

నాపై ఫిర్యాదు లేకున్నా కొట్టారు

మా స్నేహితులను పోలీసులు స్టేషన్‌కు పిలిచారని తెలిసి నేను అక్కడికి వెళ్లాను. మావాళ్లను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నిస్తే.. ఎస్సై జ్ఞానేశ్వర్‌రెడ్డి నాపై కూడా దాడికి దిగారు. విచక్షణ లేకుండా కొట్టారు. నాపై ఫిర్యాదు లేకున్నా చావబాదారు.

-తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, బాధితుడు

ఆరెకరాల పాలంపై కాంగ్రెస్ నేత కన్ను

- రైతు వద్ద కోర్టు కాపీ ఉన్నా పట్టని అధికారులు
- పోలీసుల సమక్షంలో ట్రాక్టర్‌తో పాలం చదును
- అక్రమార్కుడికి అండగా నిలుస్తున్న పోలీసులు
- కేటీదొడ్డి ఘటనపై సోషల్ మీడియాలో వైరల్

గద్వాల అర్బన్, జూలై 5: తప్పు చేసే వారి పట్ల సింహస్వప్నంగా ఉండాల్సిన పోలీసులు.. అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కేటీదొడ్డి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి పేరిట ఆరెకరాలు భూమి ఉంది. ఆ భూమిపై కొందరు కాంగ్రెస్ నాయకుల కన్ను పడింది. సదరు రైతు పోలీసులను ఆశ్రయిస్తే.. ప్రయోజనం లేకుండా పోయింది. రికార్డులో తన పేరే ఉన్నా.. పట్టాదారు పాస్ బుక్ ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయాడు. దీంతో బాధితుడు 2024లో కోర్టును ఆశ్రయించి (ఓఎస్ నెంబర్ 144) ఇంజక్షన్ ఆర్డర్ కాపీ పొందాడు. సదరు కాపీని పీఎస్‌లో చూపిస్తే.. ఇవేమీ చెల్లవంటూ కాంగ్రెస్ నేతకే వత్తాసు పలికారు. సదరు కాంగ్రెస్ నాయకుడు రైతు పొలంలో పోలీసుల సమక్షంలోనే ట్రాక్టర్‌తో దున్నించాడు. ఈ వ్యవహారాన్ని కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. డీఎస్పీ సత్యనారాయణను వివరణ కోరగా.. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు.

గుడిసెను కూల్చేసిన కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త

- అడ్డొచ్చిన